క్లుప్తంగా

వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

వడమాలపేట(పుత్తూరు): వడమాలపేట మండల పరిషత్ అధ్యక్షురాలు విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు శుక్రవారం తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌కు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు నోటీసు అందజేశారు. మండల అభివృద్ధికి ఎంపీపీ సహకరించడం లేదని, సభ్యుల విశ్వాసాన్ని కోల్పోయారని, ఫలితంగా అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిన అవసరం ఏర్పడిందని నోటీసులో పేర్కొన్నారు. చట్ట ప్రకారం నోటీసు అందుకొన్న 15 రోజుల్లోపు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అవిశ్వాస తీర్మానం నిర్వహించాల్సిందిగా కోరారు. ఆర్డీఓకు నోటీసు అందజేసిన వారిలో వైస్ ఎంపీపీలు డి.ఉపేంద్ర, వి.లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎ.రవి, ఎ.ప్రతిమ, టి.పుష్పలత, ఇ.కనకమ్మ పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర



సత్యసాయి ప్రేమ రథయాత్ర

విజయపురం: మండలంలోని మహారాజపురంలో గురువారం సత్యసాయి ప్రేమ రథయాత్ర వైభవంగా జరిగింది. చెన్నై సుందరం గుడి నుంచి పళ్లిపట్టు వరకు సాగే ఈయాత్రలో భాగంగా గురువారం మహారాజపురం మీదుగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. యాత్ర ముందు భక్తులు కోలాటం చేశారు. సుమారు 300 మందికి అన్నదానం చేశారు.

సత్యమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామంలో వెలసిన సత్యమ్మతల్లికి శుక్రవారం గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి మహిళలు పూజ సామగ్రి, పిండి దీపాలతో పంబ వాయిద్యాలతో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు.

రైతులకు జీఎస్టీపై అవగాహన



పన్నూరులో ట్రాక్టర్ ర్యాలీ

విజయపురం: మండలంలోని పన్నూరు గ్రామాల్లో శుక్రవారం జీఎస్టీ నోడల్ ఆఫీసర్ పూర్ణం, వ్యవసాయ అధికారులు జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్, పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయో పెస్టిసైడ్స్, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం ఏఓ రజినికుమారి తెలిపారు. అనంతరం పన్నూరు సచివాలయం నుంచి ట్రాక్టర్‌లో ర్యాలీ చేపట్టారు.

బోరు మోటారు పరిశీలన



పైపులైన్ పరిశీలిస్తున్న ఎస్ఈ, సిబ్బంది

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు కుశస్థలి నదిలోని రాజీవ్ టెక్నాలజీ బోరు, పైపు లైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్ తన బృందంతో కలిసి పరిశీలించారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం నీటి సరఫరా చేసే పైపులైన్లపై ప్రత్యేక దృష్టి సారించి, లీకేజి లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఈఈ విజయ్‌కుమార్, డీఈ శ్రీహరి, ఏఈ గిరీష్‌కుమార్, కాంట్రాక్టర్ ఏలుమలై పాల్గొన్నారు.

స్వచ్ఛతే గాంధీ మార్గం



నగరి: స్వచ్ఛతే గాంధీజీ మార్గమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని శ్రమదానంతో రోడ్లను శుభ్రపరిచారు. మున్సిపల్ కమిషనర్ పారిశుధ్య సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

పాలసముద్రం: సత్యం, అహింస అనే ఆయుధాల ద్వారా గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టారని, ఆయన అడుగుజాడల్లో నడవాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. శుక్రవారం పాలసముద్రం గ్రామ సచివాలయాల్లో గాంధీ జయంతిని నిర్వహించారు.

అట్టుడికిన దేవళంపేట



రోడ్డుపై ఆందోళన చేస్తున్న దళితులు



నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న ప్రజా సంఘాలు

- అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడంతో ఉద్రిక్తత
- పార్టీలకు అతీతంగా నిరసనలు
- నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్

వెదురుకుప్పం: అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడంతో దేవళంపేట గ్రామం ఆందోళనలు, నిరసనలతో అట్టుడికింది. ఇది దళితుల ఆత్మ గౌరవ సమస్య ఎంతటి వారినైనా బహిరంగంగా శిక్షించాలంటూ పెద్దఎత్తున వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ధ్వజమెత్తాయి. ధర్నాలు, రాస్తారోకోలతో దేవళంపేటలో ఒక్కసారిగా ఉద్రిక్తత్తకు దారితీసింది. ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి భారీగా జనం అక్కడికి చేరుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. శుక్రవారం ఉదయమే పోలీసులు ఘటనా స్థలంలో మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఓదశలో బీఎస్పీ నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఘటన జరిగిన చోటే విచారించి శిక్షించాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యేలు, అధికారులు కేవలం నాయకులతో మాట్లాడి వెళతున్నారే తప్ప స్థానిక సర్పంచ్, దళితుడైన గోవిందయ్యను ఎందుకు పరామర్శించి ఘటన వివరాలను తెలుసుకోరని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా కూటమిపై వ్యతిరేకత రావడంతో ప్రజల దృష్టిని వైఎస్ఆర్ సీపీపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడవుతోంది.

నూతన విగ్రహావిష్కరణ

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట గ్రామంలో నూతనంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గురువారం అర్ధరాత్రి దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటన తెలిసిందే. కాలిపోయిన విగ్రహాన్ని తొలగించి, కొత్త విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇదిలా ఉండగా విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి బొమ్మయ్యపల్లె గ్రామ కార్యదర్శి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్ తెలిపారు.

కఠినంగా శిక్షించాలి



దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఏదైనా పగ ఉంటే మనుషులపై తమ ప్రతాపాన్ని చూపించాలి. విగ్రహాలపై కాదు. ఇలాంటి ఘటన దుర్మార్గం. మండలంలో ఇంత వరకూ ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. –నాగరాజు, ఎనమలమంద

దళిత వ్యతిరేకి ఎమ్మెల్యే థామస్



దళితులకు అన్యాయం జరిగినప్పుడు ఎమ్మెల్యేగా అండగా నిలబడాల్సింది పోయి వారి మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారు. జరిగిన ఘటనపై విచారించి నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకోకుండా ఇతరులపై నెట్టే ప్రయత్నం చేయడం పద్ధతికాదు. అంబేడ్కర్ ఇచ్చిన భిక్షతో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు నేడు అదే అంబేడ్కర్‌కు ఘోర అవమానం జరిగితే రాజకీయ కోణంలో చూస్తున్నారు. దళితులు గమనిస్తున్నారు. సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్తారు.

–ఎం.రామయ్య, వెదురుకుప్పం

ప్రాణ త్యాగానికైనా సిద్ధం



అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తప్పించుకోవాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదు. దుండగులను గుర్తించి కఠిన శిక్ష వేయాలి. అధికారులు ఈ ఘటనతో నమ్మకం కలిగించాలి. న్యాయం కోసం ప్రాణ త్యాగానికైనా వెరవం. పోలీసులు ఏకపక్ష వైఖరి వీడాలి. తప్పు చేసిన వారిని వెంటనే పట్టుకోవాలి. అంబేడ్కర్ విగ్రహం పెట్టిన నాటి నుంచీ చాలా ఇబ్బందులకు గురి చేశారు. ఎలాగైనా విగ్రహాన్ని లేకుండా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారు.

–గోవిందయ్య, సర్పంచ్, బొమ్మయ్యపల్లె

ఇది ఆత్మగౌరవ సమస్య



దేవళంపేట ఘటన దళితుల ఆత్మగౌరవ సమస్య. మేము దేవుడిగా కొలుస్తున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఇలా పాశవికంగా పెట్రోలు పోసి కాల్చడం విచారకరం. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదు. ఇలాంటి దుశ్చర్యలను అందరూ ఏకమై తిప్పి కొట్టాలి. న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం.

–సుకుమార్, జెడ్పీటీసీ, వెదురుకుప్పం

పోలీసులు వత్తాసు పలుకుతున్నారు



దేవళంపేట ఘటనలో పోలీసులు నిందితులను రక్షించేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య. తప్పు జరిగిన చోట పోలీసులు అనుమానం ఉన్న వ్యక్తులను పట్టుకుని విచారించి, వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ తప్పును ఎత్తి చూపిన వారిని కట్టడి చేయడం సరికాదు. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే. దళితులు ఆరాధ్యదైవంగా కొలిచే అంబేడ్కర్ విగ్రహాన్ని ఇలా చేయడం సమంజసం కాదు. వెంటనే వారిని పట్టుకోవాలి.

–కుప్పయ్య, దళిత నాయకుడు

ఎంపీపీ బాధ్యతల అప్పగింతలో జాప్యం

నగరి: నింద్ర మండలానికి చెందిన ఎంపీపీ దీప వ్యక్తిగత కారణాలతో గత నెల 29న రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందజేశారు. నిబంధనల మేరకు సీఈఓ జిల్లా కలెక్టర్‌కు ఈ సమాచారం అందిస్తే ఆయన ఉత్తర్వుల మేరకు గెజిట్ 14/2021ని అనుసరించి వైస్ ఎంపీపీ 1, 2లలో ఒకరికి ఎంపీపీ బాధ్యతలు అప్పగించాలి. అయితే ఎంపీపీ రాజీనామా చేసి నాలుగు రోజులు అవుతున్నా బాధ్యత అప్పగించే ప్రక్రియ జరగలేదు. విజయపురం మండలంలోనూ ఎంపీపీ అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తే వైస్ ఎంపీపీ మంజు బాలాజీకి ఎంపీపీగా బాధ్యతలు అందిస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. అయితే నింద్ర మండలంలో బాధ్యతలు అప్పగించే అంశంలో మీనమేషాలు చోటుచేసుకుంటోంది. విజయపురం మండలంలో పాటించినట్లే నింద్ర మండలంలోనూ వైస్ ఎంపీపీకి బాధ్యతలు అప్పగించాలని స్థానిక వైఎస్ఆర్ సీపీ కోరుతున్నారు.

వినియోగంలోకి పిలాసపాళెం రోడ్డు



రోడ్డును ప్రారంభిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

విజయపురం: ఏళ్ల తరబడి ఊరిస్తూ వచ్చిన పన్నూరు–పిలాసపాళెం రోడ్డు గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చూపిన చొరవతో ప్రస్తుతం వినియోగంలోకి వచ్చింది. రెండేళ్ల క్రితం మాజీ మంత్రి రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించి, భూమి పూజ చేశారు. సుమారు 4.5 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు అప్పటి నుంచి నిర్మాణం చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో అంతరాయం కలిగింది. చివరికి పూర్తయింది. విజయదశమిని పురస్కరించుకొని పన్నూరు పంచాయతీ సర్పంచ్ కుమార్ గ్రామస్తులతో కలిసి రోడ్డును ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన శరన్నవరాత్రులు





నవదుర్గలకు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, ఊరేగుతున్న శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారు

కార్వేటినగరం: అమ్మవారి ఆలయాల్లో 10 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. స్కంధపుష్కరిణీ సమీపంలో వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవీ అమ్మవారి ఆలయంలో సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి పసుపు, కుంకుమ, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి, సంస్థానాధీశుల వంశస్తులైన విష్ణువర్ధన్‌రాజుతోపాటు గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

చందనాలంకరణ

మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో వెలసి ఉన్న శ్రీబాటగంగమ్మ అమ్మవారు శర్నవరాత్రులను పురస్కరించుకుని చందనాలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బాలాజీ కాలనీలో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో కణ్ణప్ప కుటుంబ సభ్యులు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలత్తూరు గ్రామ సమీపంలో వెలసి ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈడిగపల్లి గ్రామ సమీపంలో వెలసి ఉన్న ఓం శక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. శ్రీబంగారమ్మ ఆలయంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

మాజీ మంత్రి నివాసంలో..

నగరి: మాజీ మంత్రి ఆర్కే రోజా నివాసంలో విజయదశమి వేడుకలు మిన్నంటాయి. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలతో అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. విజయదశమి రోజున చిన్నారులు దైవస్వరూపులు అని చాటేవిధంగా తొమ్మిది మంది చిన్నారులను నవదుర్గలుగా భావించి వారికి పాదపూజలు చేసి, ఆశీర్వచనం తీసుకున్నారు. వారికి విందు భోజనం పెట్టి వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలాలు సమర్పించారు. కుంభ కలశాభిషేకం తరువాత దశమి పూజలు పరిపూర్ణం చేయడంలో భాగంగా స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రోచ్ఛారణ మధ్య 21 సార్లు ప్రదక్షిణ చేసి భక్తిశ్రద్ధలతో ప్రార్థించుకున్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, మురుగ, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, దీప, జ్యోతి పాల్గొన్నారు.

వేడుకగా విజయదశమి ఉత్సవాలు

నింద్ర: మండలంలోని కేఆర్‌పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన విజయదశమి మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరి, నాయకులు దాము, వేణురాజు, దీప, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

నగరి: విజయదశమి వేడుకలు మున్సిపల్, మండల పరిధిలోని ఆలయాల్లో గురువారం వైభవంగా జరిగాయి. పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అమ్మవార్లకు చేసిన అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. బుగ్గ అగ్రహారం కాశీ విశ్వేశ్వరాలయంలో దుర్గాహోమం నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరికి శ్రీకలశాభిషేక అలంకరణ చేశారు. అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయంలో మహాచండీయాగం నిర్వహించారు. గ్రామదేవత సామాలమ్మ ఆలయంలో అమ్మవారికి పసుపుతో పట్టువస్త్రాల అలంకరణ చేసి, గాజుల మాల వేసి పూజలు చేశారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి

నవనీతమ్మకు ఘన నివాళి

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బండి నవనీతమ్మ కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. శుక్రవారం వెదురుకుప్పం గ్రామంలో వారు పర్యటించారు. నవనీతమ్మ చిత్రపటానికి మాజీ ఉప ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారులు బండి ఉమాపతి రెడ్డి, సభాపతిరెడ్డి, కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను వాకబు చేశారు. వారి వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మాజీ జెడ్పీటీసీ గోవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, బూత్‌కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, ఎంపీటీసీ భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మండల ఉపాధ్యక్షుడు గోవిందన్, సింగిల్‌విండో మాజీడైరెక్టర్ మునికృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, అనిల్ ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ హయాంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువైందని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ మణి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కొంత మంది వ్యక్తులు గురువారం రాత్రి పెట్రోలు పోసి నిప్పు అంటించడం హేయమైన చర్య అని అన్నారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాలతో కలసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జరిత జనార్దన్ నాయకులు రవి, పయని, రామచంద్రయాదవ్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

విధ్వంసకారులను శిక్షించాలి

పుత్తూరు: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని దేవళంపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పలు దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళిత నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి, విధ్వంసానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న దళిత నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

పాలసముద్రం: అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, ఎంపీటీసీ గోవిందరాజు తెలిపారు. శుక్రవారం పాలసముద్రంలో పార్టీ కార్యకర్తలతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన సంఘటనను ఖండించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన వ్యక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆవేదన కోరారు. ఇలాంటి నీచమైన ఘటనలకు పాల్పడినవారిని గుర్తించి, వారికి శిక్షలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలా సర్పంచులు అయ్యప్ప, గాలి మహేష్, నరసింహనాయుడు, బాబు, వేణు, గోపాల్, షణ్ముగరెడ్డి, మనోహర్, క్రిష్ణయ్య, కుమార్, కుట్టి(అంబేడ్కర్), పద్మనాధ నాయుడు, రాజామణి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న వృద్ధులతో దాతలు

పుత్తూరు: వైఎస్ఆర్ సీపీ నాయకుడు దిలీప్‌కుమార్ తన తండ్రి సీఎస్.బాబు వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక వృద్ధాశ్రమంలోని మహిళలకు దుప్పట్లు, భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ హరి మాట్లాడుతూ బాబు విద్యారంగానికి అందించిన సేవలు మరువలేమన్నారు. అలాగే పార్టీలకు అతీతంగా పేదలకు చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఆయన చేసిన మంచి పనులను కుమారుడు దిలీప్‌మొదలి కొనసాగించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, కుట్టీ, చిన్నా, శివ, ప్రకాష్, రమేష్, చిట్టినాయుడు పాల్గొన్నారు.

గ్రామానికి దారి చూపించండి



వినతి పత్రం ఇస్తున్న సీఎస్ అగ్రహారం గ్రామస్తులు

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామానికి ఉన్న దారిని అడ్డుకున్న సంఘటన మండల పరిధిలోని సీఎస్ అగ్రహారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వందేళ్లకు పైగా గ్రామానికి రాకపోకలు సాగిస్తున్న దారిని అడ్డుకుంటున్నారంటూ ఆర్ఐకు వినతి పత్రం అందించి, అభ్యర్థించారు. గ్రామస్తులు నడుస్తున్న దారిని తమదే అంటూ కొందరు ఇబ్బందులు పెడుతున్నారని, గ్రామానికి దారి కలిపించాలని విన్నవించారు. గ్రామస్తులు మునికృష్ణారెడ్డి, రవిశంకర్, శ్రీధర్, మాధవన్, సురేష్, సాయి, తులసిరామ్, హరికృష్ణ, రోసిరెడ్డి, వినయ్, శివరాం, బాబు, పరశురామ్, నారాయణ పాల్గొన్నారు.

ఎల్లలు దాటుతున్న పేదల బియ్యం

- రేషన్ బియ్యంతో టీడీపీ నాయకులకు కాసుల వర్షం
- అక్రమంగా నిల్వ చేసిన బియ్యం స్వాధీనం
- కేసు నమోదు చేసిన పోలీసులు

శ్రీరంగరాజపురం: అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చని కూటమి నేతమి నేతలు నిరూపిస్తున్నారు. ప్రజలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. రోజుకు 5 టన్నులకు పైగా బియ్యాన్ని తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఇందుకు ప్రధాన కేంద్రంగా గంగాధరనెల్లూరు నియోజవర్గం మారింది. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. ఇది కూటమి నాయకులకు బాగా కలసి వచ్చింది. అధికార బలంతో అక్రమ బియ్యం వ్యాపారానికి తెరలేపారు. ముందుగా పేదల ఇచ్చే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వారికి అనుకూలంగా ఉన్న కోళ్లఫారాలు, మామిడి తోపుల్లోని రేకుల షెడ్లు తదితర ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని రైసు మిల్లుల్లో పాలిష్ పట్టి బ్రాండెడ్ సంచులలో నింపి తిరిగి వారికి అనుకులంగా ఉన్న దుకాణాల్లో ఉంచి మార్కెట్ ధర కంటే వినియోదారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీని ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. ఇలా గంగాధర నెల్లూరు నియోజవర్గంలో రోజుకు 5 టన్నుల బియ్యం ఎగుమతి అవుతున్నట్టు సమాచారం. అధికారులు దాడులు చేయకపోవడంతో కూటమి నేతలు వ్యాపారం విస్తృతంగా సాగుతోంది.

విజిలెన్స్ దాడులు

శ్రీరంగరాజపురం మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలోని ఎస్సీ బాలుర వసతి గృహం వెనుక టీడీపీ నాయకుడు వెంకటేష్ కోళ్లఫారం ఉంది. ఈ కోళ్లఫారంలో దాదాపు 2 టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేశారు. రహస్య సమచారం మేరకు విజిలెన్స్ సీఐ రవి తన సిబ్బందితో కలసి గురువారం ఉదయం కోళ్లఫారంలో నిల్వచేసిన 2 టన్నుల బియ్యన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. విచారణ నిర్వహించిన ఎస్ఐ సుమన్ కోళ్లఫారం యజమాని వెంకటేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ అక్రమ బియ్యం వ్యాపారం వెనుక టీడీపీ నాయకుల పెద్దలు ఉన్నట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. రాత్రి వేళల్లో నిఘా ఉంచితే బియ్యం రవాణాను అడ్డుకోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కోళ్లఫారంలో నిల్వచేసిన బియ్యంతో అధికారులు